

నైట్ షిఫ్ట్‌లకు వెళ్లాలంటేనే భయమేస్తోంది

కోల్‌కతాలో జరిగిన సంఘటన నేపథ్యంలో నైట్ షిఫ్ట్‌కు గానీ, అత్యవసర సేవలకు గానీ వెళ్లాలంటనే భయంగా ఉంటోంది. వైద్య సిబ్బంది భద్రతకు ఇప్పటికైనా ప్రభుత్వం పోలీసు రక్షణ ఏర్పాటు చేయాలి. అలాగే ఆస్పత్రుల వద్ద మహిళా సిబ్బంది కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలి. రాత్రి డ్యూటీ చేసే సిబ్బందికి రవాణా సదుపాయం కూడా కల్పిస్తే రక్షణగా ఉంటుంది.

– డాక్టర్ లాలం సింధు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, 39వ వార్డు, పాతపోస్టాఫీసు



వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి



ఆస్పత్రుల్లో పనిచేసే డాక్టర్లు, మహిళా వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. రాత్రి సమయంలో తగినంత వెలుతురు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే ఎటువంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది. ప్రభుత్వం తరఫున సెక్యూరిటీ, పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేస్తే వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ ఉంటుంది. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు ఎంత మాత్రం తగదు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన రావాలి.

– భారతి, ఏఎన్ఎం, కేజీహెచ్

క్లుప్తంగా

కుటుంబం ఉన్నా భిక్షాటన



వృద్ధుడిని అతని అల్లుడికి అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి వాసు

అల్లిపురం : కుటుంబం ఉన్నా భిక్షాటనకు అలవాటు పడ్డ వృద్ధుడిని ఏయూటీడీ అతని కుటుంబ సభ్యులకు అప్పగించింది. ఈ మేరకు కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళికి చెందిన ధర్మాన కర్రెన్న (65) భిక్షాటనకు అలవాటు పడి ప్రతి నెల పింఛన్ అందుకుని విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో భిక్షాటన చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీన ఆయనను ఏయూటీడీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గుర్తించి టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో గల ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తరలించారు. అతని అల్లుడు విశ్వనాథాన్ని పిలిపించి శనివారం అప్పగించారు. మరోసారి విశాఖ వచ్చి భిక్షాటనకు పాల్పడితే బెగ్గర్స్ హోంకి తరలించాల్సి ఉంటుందని హెచ్చరించి పంపించారు.

దాతలు ముందుకు రావాలని అభ్యర్థన



భోజనం అందజేస్తున్న స్వామి వివేకానంద సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్ : పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థ పలువురు దాతల సహకారంతో కేవలం రూ.10కే దూరప్రాంతాల నుంచి ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రికి వచ్చే పేషెంట్ల సహాయకులకు భోజనం అందిస్తోంది. ఈ కార్యక్రమ నిర్వహణకు దాతలు ముందుకు రావాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు విజ్ఞప్తి చేశారు. ఇప్పటి వరకు 390 రోజులుగా దాతల సహాయంతో భోజనాలు అందిస్తూ వచ్చామన్నారు. నాణ్యమైన బియ్యం, రసం, కూరతో రుచికరమైన భోజనం అందిస్తూ వచ్చామన్నారు. ఇక్కడ పేషెంట్ల సహాయకులకు భోజనం అవసరమని గుర్తించామని, దాతలు ముందుకు వచ్చి ఈ నిరంతరంగా ఈ కార్యక్రమం కొనసాగించేందుకు సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు.

గాజుల అలంకరణలో ఉమాదేవి



ప్రత్యేక అలంకరణలో ఉమాదేవి అమ్మవారు

అల్లిపురం : శ్రావణ మాస పూజల్లో భాగంగా టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమాదేవి అమ్మవారిని ఆలయ అర్చకుడు భార్గవశర్మ రంగు రంగుల గాజులతో విశేషంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నిమ్మకాయ డొప్పలతో నేతి దీపాలు వెలిగించి అమ్మవారికి నివేదించారు. అమ్మవారి సన్నిధిలో లలితా పారాయణ అనంతరం ఏక హారతి నుంచి నక్షత్ర హారతులతో అమ్మవారికి విశేష హారతులతో అమ్మవారిని ఆరాధించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శారదాపీఠంలో రేపు కృష్ణాష్టమి వేడుకలు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు పీఠం ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి శ్రీకృష్ణుడికి అభిషేకాలు, పూజలు, గోపూజ, సాయంత్రం ఉట్టి సంబరాలు జరుగుతాయన్నారు. 12 ఏళ్లలోపు బాలబాలికలు చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలు అలరిస్తారని.. భక్తులంతా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

నడిచేదేలా?

- పూర్ణామార్కెట్‌లో అడుగు తీసి అడుగెయ్యలేని పరిస్థితి
- వినియోగదారుల ఇక్కట్లు
- ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలంటున్న ప్రజలు

నగరంలో ఎక్కడ ఎన్ని మార్కెట్లు, రైతుబజార్లు ఉన్నా పూర్ణామార్కెట్ రాజసం వేరని చెప్పాలి. ఇక్కడ నిత్యావసరాల నుంచి ఎలాంటి సామగ్రి అయినా దొరుకుతుంది. అందుకే నగరం నలుమూలల నుంచి ప్రజలు పూర్ణామార్కెట్‌కు విచ్చేస్తూ ఉంటారు. ఈ కారణంగానే ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. దశాబ్దాల నుంచి పూర్ణామార్కెట్ ప్రాశస్త్యం పెరుగుతోంది. అయితే దానికి తగ్గట్లు ఈ ప్రాంతాన్ని విస్తరించడం గానీ, వ్యాపారులు, వినియోగదారులకు వీలుగా ఈ ప్రాంతాన్ని మెరుగుపరచడం కానీ జరగలేదు. ఈ కారణంగానే ఎప్పుడు చూసినా పూర్ణామార్కెట్ జనసందోహంతో కిక్కిరిసిపోయి ఉంటుంది.

జగదాంబ : పూర్ణామార్కెట్‌కు రావాలంటేనే ఇబ్బందిగా ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు. కాలినడకన మార్కెట్‌కు వెళ్లాలంటే ద్విచక్ర వాహనాలు గేటుకు అడ్డంగా పెట్టడం వల్ల లోపలికి వెళ్లలేక అవస్థ పడాల్సి వస్తుందంటున్నారు. ముఖ్యంగా మార్కెట్ వెనుక గేటు వద్ద అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని చెబుతున్నారు. పందుపుల్లల సందు నుంచి మొదలుకుని మార్కెట్ గేటు వరకు అనధికార పార్కింగ్‌ల వల్ల అడుగు తీసి అడుగెయ్యలేనంత ఇరుగ్గా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.

ఫ్రూట్‌మార్కెట్ వద్ద...

జీవీఎంసీ 35వ వార్డు ఫ్రూట్ మార్కెట్ వద్ద స్క్రాప్ వస్తువులతో వాహన చోదకులు, పాదచారులకు నరకం కనబడుతుందంటున్నారు. జీవీఎంసీ దుకాణాలు అద్దెలకు తీసుకుని దుకాణాలు వదిలి పూర్తిగా రోడ్డుపై వాహనాల స్క్రాప్ వస్తువులు డంప్ చేయడం వల్ల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరోపక్క రోడ్డుపైనే చేపల మార్కెట్ నిర్వహించడం వల్ల కొనుగోలుదారుల రద్దీతో పాటు దుర్గంధం ఈ ప్రాంతాన్ని ముప్పుతిప్పలు పెడుతుందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసులు సరిదిద్దాలి..

జీవీఎంసీ 35వ వార్డులో నిత్యం ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న వన్ టౌన్ పోలీసులు దృష్టి సారిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు. ఇదే వార్డులో జనతాబజార్, పందుపుల్లల సందు, మంచాల వీధి, వెలంపేట రోడ్డు, బౌడారా రోడ్డు స్ప్రింగ్‌రోడ్డు, పూర్ణామార్కెట్ వెనక భాగంలో గల అరటిపండ్ల సందు, పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి ఉన్నాయి. ఈ ప్రాంతాలన్నీ చిన్నాపెద్దా దుకాణాలతో ఆక్రమణలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బౌడారా రోడ్డులో కూడా ఈ సమస్య ఎక్కువగా ఉందని.. ట్రాఫిక్ పోలీసులు ఈ విషయంపై దృష్టి సారిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులతో పాటు ఈ ప్రాంతాలకు పని మీద వచ్చే వారు అభిప్రాయపడుతున్నారు.



పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద అడ్డంగా పెట్టిన ద్విచక్ర వాహనాలు



ఫ్రూట్ మార్కెట్ వద్ద రహదారికి అడ్డంగా పెట్టిన స్క్రాప్



రోడ్డుపై తోపుడు బళ్లు



బౌడారా రోడ్డులో రహదారికి అడ్డంగా పెట్టిన వాహనాలు

విశేషంగా శ్రావణలక్ష్మి పూజలు



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: శ్రావణమాసం సందర్భంగా కనక మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు 20వ రోజుకు చేరాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య శనివారం ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈవో పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీ దళార్చన

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసీ దళార్చన విశేషంగా జరిగింది. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి త్రికాల పంచామృతాభిషేక సేవ విశేషంగా జరిగింది. సహస్ర తులసీ దళార్చనలో పాల్గొనాలంటే రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనాలంటే రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

సాంప్రదాయ నాట్య కళలను ప్రోత్సహించాలి

సీతమ్మధార : శంకరమఠం ఎదురుగా ఉన్న పద్మశాలి భవన్‌లో నటరాజ్ నృత్యనికేతన్ వ్యవస్థాపకులు, నాట్యగురువు జి.పరమేశ్వరన్ సారథ్యంలో సాంప్రదాయ రీతిలో గజ్జ పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ హాజరై మాట్లాడారు. మన భారతదేశ సాంప్రదాయ కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భారతదేశ ఔన్నత్యానికి, అఖండ కీర్తికి సాంప్రదాయ నాట్య కళలు తార్కాణమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా నాట్య కళను నేర్చుకుంటే అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. గురువులు పరమేశ్వరన్, భాను పరమేశ్వరన్‌లను అభినందించారు. అనంతరం రాజశేఖర్‌ను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారిణి సుశీల నాగరాజు, శ్రీభక్త మార్కండేయ ట్రస్ట్ ప్రతినిధులు కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, వి.కృష్ణమోహన్, బి.పి.ఎస్. కళ్యాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మికతవేత్త రాజశేఖర్‌ను సత్కరిస్తున్న కళాకారులు

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి సుమారు రూ. 88 వేలు ఖరీదు చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది రైల్వేస్టేషన్‌లో గల వివిధ ప్లాట్ ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తుండగా మాలప్పురం, కేరళకు చెందిన అబ్దుల్ మాలిక్, మహ్మద్ ముస్ఫిర్, మహ్మద్ ఫాజిల్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి సుమారు రూ. 88 వేల విలువైన 17.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎస్ఐ ఎస్.కె. అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన యువకులతో రైల్వే పోలీసులు

ఆచరణాత్మక జ్ఞానంతో అద్భుత ఫలితాలు

మురళీనగర్ : ఆచరణాత్మక జ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్ ఆర్‌జేడీ జె. సత్యనారాయణమూర్తి అన్నారు. ఏపీసీటీఈ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజులుగా తయారీ నాణ్యత అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్పత్తుల సాధనలో శాస్త్రీయత, విశ్లేషణాత్మకత అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు సాధించగలమన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ పొందిన అధ్యాపకులు మెకానికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. రాంజీ మాట్లాడుతూ నైపుణ్యం విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన పరికరమన్నారు. విశాఖ రిఫైనరీ డీజీఎం కేతు శ్రీధర్ మాట్లాడుతూ తయారీలో నాణ్యత నిర్వహణ పరిశ్రమల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఒ.రామ్మోహనరావు, గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, పెందుర్తి పాలిటెక్నిక్ ఓఎస్‌డీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, మెకానికల్ ఇంజినీరింగు హెడ్ కె.మధుకుమార్, ఇతర విభాగాల హెడ్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణమూర్తి

మత్తు ముప్పు నుంచి పిల్లల్ని మనమే కాపాడుకోవాలి

సీతమ్మధార: మాదక ద్రవ్యాల వైపు పిల్లలు ఆకర్షితులవకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలలపై లైంగిక దాడులు, మంచి-చెడు స్పర్శల గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. పాఠశాలల ప్రాంగణాల్లో ఫిర్యాదుల పెట్టెల ఏర్పాటుపై డీఈవో చంద్రకళ చొరవ అభినందనీయమన్నారు. ఏయూ సైకాలజీ విభాగం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రుల కంటే పాఠశాలల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నందున, వారి మనసులను అన్ని కోణాల్లోనూ అనుకూలంగా మార్చేలా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఖలీసా బేగం సమన్వయకర్తగా, ఎంఈవోలు డి.రామారావు, బాలమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో వెంకటేశ్వరి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.విజయ, పిల్లల మనస్తత్వ నిపుణులు ఎం.సాయి, వంశీ, పార్వతీ కశ్యప్, డీసీపీయూ ప్రతినిధులు కె.శారద, కె.శకుంతల, ఆనంద్, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.మనోజ్, కె.వి జయకుమారి, సీఆర్పీలు, వార్డు సచివాలయాల కార్యదర్శులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్‌గా కంచర్ల

మద్దిలపాలెం: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ చైర్మన్‌గా డాక్టర్ కంచర్ల అచ్యుతరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపకార్ ట్రస్ట్ అధ్యక్షునిగా, సినీ నిర్మాతగా, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కంచర్ల సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల సినీ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఏ ప్రాంతంలో షూటింగ్ జరిగితే ఆ ప్రాంత కార్మికులకు అవకాశం కల్పించడానికి, వారి జీవనోపాధికి బాటలు వేస్తానన్నారు. అనంతరం ఆయనను పలువురు ఘనంగా సత్కరించారు.



కంచర్ల అచ్యుతరావును సత్కరిస్తున్న ఫెడరేషన్ సభ్యులు

వర్షంతో ఉపశమనం

బీచ్‌రోడ్డు: ఆరిలోవ ప్రాంతంలో శుక్రవారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి వాతావరణం కాస్త చల్లబడింది. రెండు రోజులుగా ఉక్కపోతతో సతమతమైన జనం ఉపశమనం పొందారు. చల్లని గాలి వీచడంతో ఆరిలోవ ప్రాంత వాసులు కాసేపు ఆస్వాదించారు. శనివారం ఉదయం, కాస్త విరామం తర్వాత మధ్యాహ్నం వర్షం కురవడంతో ఆరిలోవ కాలనీ మొదలు టి.ఐ.సి.పాయింట్, బాలాజీనగర్, తోటగరువు ప్రాంతాల్లో రోడ్లు తడిసిముద్దయ్యాయి. పలువురు వానలో తడుస్తూ వాహనాలపై రాకపోకలు సాగించారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు



చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం : నేరెళ్లకోనేరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కొబ్బరితోట యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొని చిన్నారులకు కోరింత దగ్గు, హెపటైటిస్ బీ, పోలియో వ్యాక్సిన్లు వేశారు. బాలింతలు, గర్భిణులకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు.

ఉత్సాహంగా యూత్ పార్లమెంట్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయులు

సింధియా : మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయంలో 35వ రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు రెండో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. హైదరాబాద్ రీజినల్ ఆఫీస్ నుంచి అసిస్టెంట్ కమిషనర్ రెజి.వి.ఆర్.విశ్వనాథ్ ప్రత్యేక న్యాయమూర్తిగా వ్యవహరించిన పోటీల్లో నెల్లూరు కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు, జీవీ పికెట్ హైదరాబాద్, కేవీ ఎన్ఏపీ హైదరాబాద్, కేవీ బొల్లారం హైదరాబాద్, కేవీ – 2 శివాజీనగర్ విశాఖపట్నం విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ పోటీల్లో కేవీ – 2 శివాజీనగర్ విశాఖపట్నం, కేవీ నెల్లూరు, కేవీ పికెట్ హైదరాబాద్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారికి సహస్ర నామార్చన

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ దరి ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం దివ్యక్షేత్రంలో వేకువ జాము నుంచే తోమాల సేవ, సుప్రభాత సేవలు జరిపారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి సహస్రనామార్చన నిర్వహించారు. విశేష అలంకరణలో స్వామి భక్తులకు దర్శన మిచ్చారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

చిన్నోడి పెద్ద మనసు

50 మంది విద్యార్థులకు రూ.6 లక్షల సాయమందించిన రోహన్ చెర్ల



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోహన్ చెర్ల

డాబాగార్డెన్స్ : ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యకు దూరం అవుతుంటారు చాలా మంది పేద విద్యార్థులు. అటువంటి వారికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చాడు 17 ఏళ్ల రోహన్ చెర్ల. రోహన్ తాత వారణాసి సూర్యనారాయణ మూర్తి విశాఖ మహా నగరంలో గల ఏవీఎన్ కళాశాలలో ఇంగ్లీషు అధ్యాపకునిగా పని చేశారు. ఆయన జ్ఞాపకార్థం కళాశాలలో బాగా చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు రోహన్ చెర్ల ముందుకొచ్చాడు. ఈ మేరకు ఏవీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోహన్ చెర్ల మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి చదువుకు ప్రోత్సాహం అందివ్వడమే ధ్యేయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ తాను చదువుకుంటూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు అందజేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జోసెఫ్ మార్షల్, సాయి హిరణ్మయి చెర్ల, రోహన్ కమత్, ఆకెళ్ల శైలజ, డాక్టర్ మహలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజనీ తదితరులు పాల్గొన్నారు.

ఆటోల దొంగ అరెస్ట్

సీతమ్మధార : ఆటో దొంగతనం చేసిన వ్యక్తిని ఫోర్తుటౌన్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫోర్తుటౌన్ క్రైం పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొండపర్తి మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా పార్కు చేసిన ఆటో (నెంబర్ ఏపీ31 టిడి7864) గుర్తు తెలియని వ్యక్తి దొంగలించినట్లు ఆటో యాజమాని మామిడి అప్పలరాజు ఈనెల 21వ తేదీన ఫోర్తుటౌన్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె.భాస్కరరావు 24 గంటల్లో విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం, కొప్పెర్ల గ్రామానికి చెందిన ముద్దాయి వంజరానా నరిసింహారావుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరస్తుడి వద్ద నుంచి మరో రెండు ఆటోలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. భీమిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ కళాశాల వద్ద గత ఏడాది డిసెంబర్‌లో ఒక హోండా యాక్టివా, అలాగే తగరపువలస తాతా థియేటర్ వద్ద ఒక ఆటో, ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధి సెక్టార్-1లో ఒక ఆటోను దొంగిలించినట్లు నేరస్తుడు ఒప్పుకున్నట్లు ఎస్ఐ కె.భాస్కరరావు తెలిపారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.